గ్రామ పంచాయతీ
ఆదాయం చెత్తపాలు


కోనాయి చెరువు వద్ద చెత్త నిల్వలు

- అనధికార డంప్‌గా కోనాయి చెరువు
- చెత్త తరలింపునకు ఏడాదికి రూ.లక్షల్లో కేటాయింపు
- అధికారులు, నేతల చేతివాటంపై ఆరోపణలు
- శాశ్వత పరిష్కారం లేని వైనం

గన్నవరం: రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్నట్లుగా.. గన్నవరం గ్రామ పంచాయతీ ఆదాయం చెత్త పాలవుతుంది. కుళాయి, ఇంటి పన్నుల రూపంలో గ్రామ పంచాయతీకి సమకూరుతున్న ఆదాయంలో అధిక భాగం చెత్త నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక కోనాయి చెరువు వద్ద అనధికారంగా డంప్ చేస్తున్న చెత్తను తొలగించేందుకు ప్రతి ఏటా రూ.లక్షల్లో వెచ్చిస్తున్నారు. ఈ చెత్త తొలగింపు పనుల్లో కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా అంచనాలు పెంచేసి అందులో కూడా దోచుకుంటున్నారు. ఇప్పటికే చెత్త తరలింపుకు గత మూడేళ్లలో రూ.30 లక్షల వరకు గ్రామపంచాయతీ నిధులు కేటాయించారు. కొత్తగా మరో రూ.11.45 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి చెత్త తొలగింపు పేరుతో దోపిడీకి తెరతీశారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలో చోటుచేసుకున్న భారీ అవకతవకలు కారణంగా గ్రామాభివృద్ధి కుంటుపడింది. ఈ పరిస్థితుల్లో ఉన్న నిధులను కూడా చెత్త తరలింపు పేరుతో దుర్వినియోగం చేస్తుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మరోసారి చెత్త తరలింపు పనులు..

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు కోనాయి చెరువు వద్ద చెత్త తరలింపునకు అధికారులు మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఆరు నెలలు క్రితం రూ.8 లక్షలతో చెత్త తరలింపు పనులు చేపట్టారు. ఇదే పనికి ఇప్పుడు గతంలో కంటే ఏకంగా రూ.3.45 లక్షలు అంచనాలు పెంచేసి మొత్తం రూ. 11.45 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులకు పంచాయతీ పాలకవర్గం కూడా అత్యవసర సమావేశం నిర్వహించి ఆమోదం తెలిపింది. అదే రోజు కొబ్బరికాయ కొట్టి చెత్త తరలింపు పనులు కూడా ప్రారంభించారు. అయితే ఈ పనుల కాంట్రాక్ట్ అప్పగించే విషయంలో కూడా టీడీపీకి చెందిన రెండు వర్గాలు పోటీపడ్డాయి. తొలుత కేసరపల్లికి చెందిన టీడీపీ నేత శాంతి కిషోర్‌కు కాంట్రాక్ట్ అప్పగించడంతో పనులు ప్రారంభించారు. సాయంత్రానికి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పనులు నిలిపివేశారు. ఈ పనులను మరోక కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. గ్రామాభివృద్ధికి, ప్రజల సదుపాయల కల్పనకు వినియోగించాల్సిన గ్రామ పంచాయతీ నిధులు చెత్త పాలవుతుండడం పట్ల పలువురు మేధావులు, రాజకీయ వేత్తలు, స్థానికులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన కోనాయి చెరువు వద్ద చెత్త డంపింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. చెత్తను గుంటూరు వద్ద జిందాల్ ప్లాంట్‌కు తరలించేందుకు గన్నవరం, కేసరపల్లి, బుద్ధవరం గ్రామ పంచాయతీల సంయుక్త నిధులు రూ.54 లక్షలతో కొనుగోలు చేసిన చెత్త తరలింపు వాహనాన్ని సక్రమంగా వినియోగించాలని సూచిస్తున్నారు.

చెత్త నిర్వహణలో వైఫల్యం

మేజర్ గ్రామ పంచాయతీ గన్నవరంలో సుమారు 30 వేల మంది జనాభా నివాసిస్తున్నారు. ప్రతి రోజు గ్రామంలో ఐదు టన్నుల వరకు చెత్తను పారిశుద్ధ్య కార్మికులు సేకరిస్తున్నారు. గతంలో ఈ చెత్తను ట్రాక్టర్ల ద్వారా 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న గొల్లనపల్లి శివారులోని కొండ పోరంబోకుల్లో డంప్ చేసేవారు. అయితే అక్కడ చెత్త డంపింగ్‌ను రైతులు తీవ్రంగా వ్యతిరేకించడంతో గత నాలుగేళ్లుగా కోనాయి చెరువు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుకు రెండు వైపులా డంప్ చేస్తున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో భారీగా చెత్త నిల్వలు పేరుకుపోయి పరిసరా ప్రాంత రైతులు, అటుగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో మూడేళ్ల క్రితం రూ.18 లక్షలు గ్రామ పంచాయతీ నిధులతో చెత్తను బయటకు తరలించారు. మళ్లీ అదే ప్రాంతంలో చెత్త డంపింగ్ కొనసాగడంతో గత రెండేళ్లలో మరో రూ.12 లక్షల వరకు చెత్త తరలింపునకు, నిర్వహణకు కేటాయించారు. ఈ పనుల్లో కూడా ఇష్టారాజ్యంగా అంచనాలు పెంచి పంచాయతీ నిధులను అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ చెత్త డంపింగ్‌కు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఈ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

కాంట్రాక్ట్ సమస్యతో..

పాలకవర్గ సమావేశ తీర్మానం మేరకు తొలుత చెత్త తరలింపు పనులు ప్రారంభించాం. అయితే కాంట్రాక్ట్ కేటాయింపు విషయమై నెలకొన్న సందిగ్ధత కారణంగా పనులు నిలిచిపోయాయి. కొద్ది రోజుల్లో కాంట్రాక్ట్ కేటాయింపు ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభిస్తాం. పూర్తిగా చెత్తను తొలగించి ఆ ప్రాంతంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొదిస్తాం.

– ఎస్.చెన్నకేశవరావు, ఈఓ, గన్నవరం

క్లుప్తంగా

ఐడీ కార్డులు జారీ చేసేందుకు సర్వే

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులకు అపార్ ఐడీ కార్డులను అందచేసేందుకు సర్వే చేస్తున్నామని విజయవాడ రూరల్ మండల విద్యాశాఖాధికారి 2, ఎ.సూరిబాబు తెలిపారు. నున్న గ్రామం మండల వనరుల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. అపార్ ఐడి అనేది విద్యార్థి జీవిత కాలం పురోగతి, విజయాలను ట్రాక్ చేసే శాశ్వత ఐడి నెంబరు అని చెప్పారు. ఇది విద్యార్థుల ఆధార్ ఐడీకి అదనంగా పని చేస్తుందని వివరించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. మండలంలో 28,502 మంది ఉండగా 15,899 మంది విద్యార్థుల వివరాలను సేకరించామని తెలిపారు.

గ్రంథాలయానికి గోడ గడియారం బహూకరణ



గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయానికి పాఠకుడు చిన్నబత్తిన శాంతకుమార్ గోడ గడియారం బహూకరించారు. ఈ మేరకు బుధవారం గ్రంథాలయ సిబ్బంది పి. దుర్గాలక్ష్మీకి గోడ గడియారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాంతకుమార్‌ను గ్రంథాలయ సిబ్బంది శాలువాతో సత్కరించారు. గ్రంథాలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ వంతు తోడ్పాటునందించడం అభినందనీయమని చెప్పారు. గ్రంథాలయ సిబ్బంది రామచంద్రరాజు, జె.శేఖర్, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

నేడు 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన

గన్నవరం: స్థానిక విమానాశ్రయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ గురువారం శ్రీకారం చుట్టనుంది. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న 33/11 కేవీ ఉప కేంద్రం ఆవరణలో అధికారులు శంకుస్థాపకు ఏర్పాట్లు చేశారు. 132/33 కేవీ ఉప కేంద్రం నిర్మాణ పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తారని ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని వీక్షించేందుకు సబ్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉప కేంద్రం నిర్మాణం పూర్తయితే విమానాశ్రయంతో పాటు ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కారం కానున్నట్లు చెప్పారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పొలాల్లో వరదనీరు పోయేలా చూడండి



అంబాపురం(విజయవాడరూరల్): రెండు నెలల క్రితం వచ్చిన వరదల కారణంగా పొలాలకు పట్టిన వరదనీరు అలాగే ఉందని, మురుగునీరు పోయే మార్గం చూడాలని అంబాపురం రైతులు వ్యవసాయాధికారికి విజ్ఞప్తి చేశారు. అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు మాట్లాడారు. పొలాల్లో మురుగు సమస్య ఉందని వాటిని బయటకు పంపే మార్గం లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు తెలియజేశారు. దాళ్వాలో వరిసాగు చేసే రైతులకు 1121 వరి విత్తనాలు సబ్సిడీ పై సరఫరా చేయాలని రైతులు కోరారు. వచ్చే వారంలో విత్తనాలు ఏపీ సీడ్సు ద్వారా సరఫరా చేసే అవకాశం వుందని ఏఓ తెలియజేశారు.

వక్ఫ్‌బోర్డు ముస్లింలతోనే ఏర్పాటుచేయాలి

కంకిపాడు: వక్ఫ్ సవరణ చట్టం ద్వారా వక్ఫ్ బోర్డును కేవలం ముస్లింలతోనే ఏర్పాటుచేయాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్‌బోర్డులో ముస్లింలు కాని వారిని కూడా నియమిస్తామని ప్రధాని మోడీ ప్రకటన చేయటం దురదృష్టకరమన్నారు. వక్ఫ్‌బోర్డును కేవలం ముస్లింలతోనే ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. టీటీడీ పాలక మండలిలోనూ ముస్లింలకు అవకాశం ఇచ్చి ఉంటే అన్ని మతాలకు సమన్యాయం జరిగినట్లు అయ్యేదన్నారు. ముస్లిం సామాజిక వర్గాల ఆచారాలను, సాంప్రదాయాలను గౌరవిస్తూ పాలన సాగించాలని సూచించారు.

బీవీ రావు జీవితం ఆదర్శప్రాయం



కంకిపాడు: పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీ రావు జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ బీవీరావు జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ గోకుల్‌మిషన్, పశుగణాభివృద్ధి సంస్థ గన్నవరం సహకారంతో కుందేరు గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. తొలుత డాక్టర్ బీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు ఉడికించిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని శ్రీనివాసా హేచరీస్ ఎండీ డాక్టర్ సోమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పశువుల పెంపకంపై రైతాంగం దృష్టి సారించాలని సూచించారు. పశుపోషకుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ ఈడీ డాక్టర్ కె.శ్రీనివాసరావు, గుడ్లవల్లేరు ఉపసంచాలకులు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, కుందేరు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీఎస్ రంగారావు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి

కంకిపాడు: భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్ఐ ఉస్మాన్ అన్నారు. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో భూ రీ సర్వేపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. సభలో భూ సమస్యలకు సంబంధించి తొమ్మిది అర్జీలు అందాయి. పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, ఏఓ పిఎం కిరణ్, సర్వేయరు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి


కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నేతలు

గన్నవరం: విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 20వ తేదీన జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంద వేణు మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల మాదిగ, ఉపకులాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో జరగనున్న ఈ సమ్మేళనంలో చర్చించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మాదిగ, ఉపకులాలు ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని కోరారు. ఎంఈఎఫ్ నాయకులు దేవరపల్లి విక్టర్ బాబు, ఏసుబాబు, రెల్లి సంఘ నేత ధనియాల నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, ఎర్రగుంట వినోద్, చిల్లిముంత కోటేశ్వరరావు, కొప్పుల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విచక్షణారహితంగా పురుగు మందులు వాడొద్దు

మండల వ్యవసాయాధికారి కిరణ్


దావులూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ కిరణ్, రైతులు

కంకిపాడు: పైరు సంరక్షణలో విచక్షణారహితంగా పురుగు మందులు వాడవద్దని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ సూచించారు. మండలంలోని దావులూరు, ప్రొద్దుటూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న వరి, మినుము ఇతర పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. విచక్షణా రహితంగా పురుగు మందులు, ఎరువులు వాడటం వల్ల పెట్టుబడులు వృథా అవుతాయని చెప్పారు. పురుగుల్లో నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ ఇచ్చిన సిఫార్సులు పాటించాలని, సస్యరక్షణ చర్యల్లో ఇదే కీలకమని పేర్కొన్నారు. మినుము పైరు పూతలో వచ్చే పురుగు నివారణపై దృష్టి సారించాలన్నారు. ఎర పంటలుగా బంతి, కంది పంటలను సాగుచేసుకోవటం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో చలివేంద్రపాలెం సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, వీఏఏలు ధాత్రికా, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ పవన్ కిషోర్

రామవరప్పాడు: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని పటమట సీఐ పవన్ కిషోర్ అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు విజయ ఫార్మసీ కళాశాలలో బుధవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం వర్క్ షాపు ఆన్ డ్రగ్ ప్రివెన్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కిషోర్ మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు కాస్తా బానిసలుగా మారుస్తాయన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన చట్టాలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. మరో అతిథి డాక్టర్ స్వరాజ్య లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి తమ విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవస్థ, సమాజంలో గౌరవ మర్యాదలు నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డ్రగ్స్ – దుష్పరిణామాలు అంశంపై అవగాహన కల్పించారు. యువత ఏ విధంగా ఆకర్షితులవుతున్నారు, వాటి బారి నుంచి ఎలా రక్షించుకోవాలని అనే విషయాల గురించి వివరించారు. నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంపై కలిగే అనర్థాలపై నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అనేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ నుంచి శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ నుంచి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఉంగుటూరు: తరిగొప్పలలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఉంగుటూరు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్రమంగా మద్యం తరలిస్తున్న సమాచారంతో దుర్గారావు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 40 క్వార్టర్ల మద్యం సీసాలు లభించాయి. అనంతరం నిందితుడిని స్టేషన్‌కు తరలించి ఎస్ఐ గోవిందు కేసు నమోదు చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం చట్ట విరుద్ధమని ఎవరైనా అటువంటి కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కల్తీ ఆహారం ప్రాణాంతకం


మాట్లాడుతున్న మోహన్‌రావు కొఠారి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కల్తీ ఆహారాన్ని తీసుకోవటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తటంతో పాటు కొన్ని సందర్భాలలో ప్రాణాంతకం అవుతుందని ఎన్టీఆర్ జిల్లా అఖిల భారతీయ గ్రాహక్ పంచాయిత్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రావు కొఠారి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఆహారపు కల్తీ అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది.

కల్తీ జరగకుండా చూసుకోవాలి..

కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆహారంలో కల్తీ క్షమించరాని నేరంగా పరిగణించాలన్నారు. ఆహారంలో కల్తీ ఏ విధంగా జరుగుతుంది వాటిని ఏ విధంగా గుర్తించాలో వివరించారు. ఆహార పదార్థాల ప్యాకెట్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర ఆహార భద్రతను సూచిస్తుందన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

పెనమలూరు: మండల కేంద్రంలో విద్యార్థి అదృశ్యం అయిన ఘటన పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ.ఎల్ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రజాక్ 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ప్రైవేటుకు వెళుతున్నాని తల్లితండ్రులకు చెప్పి సైకిల్‌పై వెళ్లాడు. అయితే బయటకు వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి రాలేదు. ఈ ఘటన పై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడు సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు చెప్పాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్‌లో...


అదృశ్యమైన టెన్త్ విద్యార్థి బాలాజీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామానికి చెందిన మాళావతు గోపి తన కుమారుడు బాలాజీని ఈ నెల 5వ తేదీ ఉదయం యథావిధిగా ద్విచక్రవాహనంపై తీసుకొచ్చి స్కూల్ వద్ద దింపి తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. ఆ రోజు సాయంత్రం కుమారుడు ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు భయాందోళనతో పాఠశాలలో ఆరా తీయగా, అసలు బాలాజీ మంగళవారం తరగతులకు హాజరుకాలేదని ఉపాధ్యాయులు బదులిచ్చారు. దీంతో మరింత ఆందోళనకు గురైన తల్లిదండ్రులు తోటి విద్యార్థులు, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద బాలాజీ ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. కానీ ఫలితం లేకపోవటంతో బుధవారం పెదపాడు పోలీస్‌స్టేషన్‌లో బాలుడి ఆదృశ్యంపై ఫిర్యాదు చేశారు.

రూ.52.60 లక్షల ప్యాకేజీతో అమెజాన్‌లో ఉద్యోగం

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబి యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని నిహిత వేములపల్లి బహుళజాతి సంస్థ అయిన అమెజాన్‌లో మంచి ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రవిచంద్ బుధవారం వివరాలు తెలుపుతూ నిహిత అమెజాన్‌లో రూ.52.60 లక్షల ప్యాకేజీతో సొల్యూషన్ ఆర్కిటెక్‌గా ఉద్యోగం పొందిందన్నారు. నిహితకు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పీవీ రావు, వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డీన్ రాజేశ్వరరావు, ఉపాధికల్పన అధికారి కె.శ్రీనివాస్, కాలేజీ యాజమాన్యం అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కంకిపాడు జెడ్పీ స్కూల్ విద్యార్థులు


పీయూషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్


ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం జి.సుధారాణి, వ్యాయామ ఉపాధ్యాయులు

కంకిపాడు: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు కంకిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సత్తా చాటిన క్రీడాకారులను పాఠశాల హెచ్ఎం జి.సుధారాణి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన గన్నవరం బాలుర పాఠశాలలో స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా టీమ్స్ సెలక్షన్స్ జరిగాయన్నారు. అండర్–17 బాలికల విభాగంలో సాఫ్ట్‌బాల్‌కు శీలం కీర్తి, బేస్‌బాల్‌కు దండుగుల నర్సమ్మ, అండర్–14 బాలికల విభాగంలో సాఫ్ట్‌బాల్‌కు చేబ్రోలు సానిక, సీతాల సాయి వర్షిత నాయుడు, బేస్‌బాల్‌కు మట్టా కీర్తి, యార్లగడ్డ భవిసారిక ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు చిత్తూరు, గుంటూరుల్లో జరిగే సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మత్తి హరిగోపాల్, లకనం దుర్గాప్రసాద్‌లను ఎంఈఓ కెఎస్‌వి ప్రసాద్, హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు...

గన్నవరం: స్థానిక వీఎస్. సెయింట్‌జాన్స్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న డి.నాగ పీయూష జాతీయ స్థాయి ఫెన్సింగ్(కత్తిసాము) పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నంద్యాలలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పియూష అండర్–17 విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఆమె ప్రతిభను గుర్తించిన సెలక్షన్ కమిటీ జమ్మూకాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ పోటీల్లో పీయూష ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థినిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభించిన దృశ్యం

గన్నవరం రూరల్: మండలంలోని బీబీ గూడెం గ్రామం నుంచి తోటపల్లి వరకూ రూ.25 కోట్లతో నిర్మించే ఆర్అండ్‌బి డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం బీబీగూడెం మాజీ సర్పంచులు బోయపాటి బసవపూర్ణయ్య, మురళీకృష్ణ ప్రారంభించారు. ఈరోడ్డు గోతులు, గుంతలమయంగా ప్రయాణాలకు అనువుగా లేకపోవటంతో వెంటనే ప్రభుత్వం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. ఆర్ అండ్‌బీ ఏఈ శ్రీహరి, రవీంద్ర, సీమోను, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేమల్లే జెడ్పీ హైస్కూల్‌కు వంట సామగ్రి అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్‌కు దాత వంట సామగ్రిని విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన యనమదల భీమశంకర శ్రీనివాసరావు మధ్యాహ్న భోజనం తయారీ నిమిత్తం రూ.30 వేలు విలువ చేసే వంట సామగ్రిని బుధవారం అందజేశారు. గ్రామ ప్రముఖుడు కలపాల రాధాకృష్ణా (చంటియ్య) చేతుల మీదగా ఈ సామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్‌పాల్‌కు అప్పగించారు. గ్రామ ప్రముఖుడు వడ్లమూడి వెంకట కృష్ణారావు, కొల్లూరు చంద్రకాంత్ పాల్గొన్నారు.

మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి

గన్నవరం రూరల్: ఉష్ణోగ్రతలు తగ్గడంతో మామిడి మొక్కలు మార్పులకు లోనవుతాయని ఉద్యానవన అధికారి ఇ.హరించంద్ చెప్పారు. మామిడి తోటలో తేనె మంచు పురుగులు, రసం పీల్చే పురుగులు, పండు ఈగలు పెరుగుతాయని తెలిపారు. వీటి నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు చెట్లకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు జాగ్రత్తలు పాటించి పురుగులు నివారించుకోవాలని పేర్కొన్నారు.

ప్రకటన

మా క్లయింటు, విజయవాడ రూరల్ మండలం, ఎనికేపాడు గ్రామ కాపురస్థులు. కొంగర కేశవరావు గారి కుమారుడు సుధీర్‌బాబు గారు [illegible] ఆస్తిని క్రయం పొందుటకు గుంటూరు జిల్లా, తుళ్ళూరు కాపురస్థులు మెస్సర్స్ [illegible] సొసైటీ, తుళ్ళూరు తరఫున ప్రెసిడెంట్ [illegible] నెం. 8859/2024 తేది. 16.07.2024న పొందియున్నారు.

సదరు [illegible] సొసైటీ వారు [illegible] 1994వ సంవత్సరములో విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి [illegible] నెం. 6466/1994, 6496/1994, 6596/1994, 6558/1994 మరియు 8853/1994లు [illegible] సొసైటీ వారి [illegible] ఏ విధమైన హక్కులు కాని, క్లెయిములు కాని, అభ్యంతరములు కాని, ఇతరత్రా ఆక్షేపణలు కాని యున్నయెడల [illegible] రోజులలో లిఖితపూర్వకముగా తెలియపరచవలసినదిగా కోరడమైనది. [illegible] క్లెయిములు మా క్లయింటుని బైండ్ చేయజాలవు.

షెడ్యూలు : యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ రూరల్ మండలం, ఎనికేపాడు గ్రామపంచాయతీ, ఎనికేపాడు గ్రామ రీ.సర్వే నెం. 211/6ఎ [illegible] 1.012 [illegible] హద్దులు. తూర్పు – పంచాయతీ రోడ్డు, దక్షిణం – పంచాయతీ రోడ్డు, పడమర – ఇతరుల ఆస్తి, ఉత్తరం – కొంగర సుధీర్‌బాబు గారి ఆస్తి.
(Happy Child Development and Rehabilitation Center)

[illegible], అడ్వకేట్స్
సత్యనారాయణపురం, విజయవాడ – 520011, ఫోన్ : 97059 59284